ప్రజాశక్తి

శనివారం 13 డిసెంబర్ 2025

5

అల్లూరి సీతారామరాజు

రగ్గులు, సరుకుల పంపిణీ

ప్రజాశక్తి డుంబ్రిగుడ:సమాజ సేవే ట్రస్ట్ లక్ష్యంగా పెట్టుకుందని మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వికాస్ అన్నారు. మండలంలోని సొవ్వా పంచాయతీ మారుమూల సాగరివలస గ్రామంలో ఆ ట్రస్ట్ ఆధ్వర్యాన పీటీజీ గిరిజనులకు రగ్గులు, నిత్యావసర సరకులను అందజేశారు. ట్రస్ట్ ద్వారా తొమ్మిదేళ్లుగా గిరిజనులకు సేవలు చేస్తున్నామన్నారు. కొవిడ్ ఆపత్కాల కాలంలో ఆఖరి ప్రయాణ రథంతో పేద గిరిజనుల గ్రామాల చెంతే మృతదేహాలను తరలించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సంతోష్, కార్యదర్శి రంజిత్ కుమార్, సభ్యుడు సునీల్, సింహాచలం, నాయకులు నర్సింగరావు, పాపారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రగ్గులు ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

మృత్యులోయ

- మారేడుమిల్లి ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం
- ప్రైవేటు బస్సు బోల్తా పడి తొమ్మిది మంది మృతి
- చనిపోయినవారిలో చిత్తూరు వాసులు
- తీర్థయాత్రలు చేస్తుండగా విషాదం
- చింతూరు ఆసుపత్రిలో మిన్నంటిన రోదనలు
- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రులు, ఎక్స్‌గ్రేషియా ప్రకటన

చెల్లా చెదురుగా పడిఉన్న మృతదేహాలు (ఇన్‌సెట్‌లో) ప్రమాదానికి గురైన బస్సు

ప్రజాశక్తి - చింతూరు, మోతుగూడెం

అల్లూరి జిల్లా మారేడుమిల్లి - చింతూరు ఘాట్‌లోని వనదుర్గ ఆలయ సమీపంలో శుక్రవారం తెల్లవారుజాము మూడున్నర గంటల సమయంలో ఓ ప్రైవేటుబస్సు అదుపుతప్పి లోయలో తలకిందులుగా పడిపోవడంతో అంతులేని విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతిచెందారు. వారిలో నలుగురు పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. మిగతావారంతా గాయపడ్డారు. క్షతగాత్రులు చింతూరు, భద్రాచలంల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం మేరకు.. ఈ నెల 6న చిత్తూరు నుంచి 35 మంది ప్రయాణికులతో చిత్తూరు నగరానికే చెందిన శ్రీ విఘ్నేశ్వర ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తీర్థయాత్రల నిమిత్తం బయలుదేరింది. ఇద్దరు డ్రైవర్లు ఆ బస్సులో ఉన్నారు. కోటప్పకొండ, అమరావతి, మంగళగిరి, విజయవాడ, ద్వారకా తిరుమల, భీమవరం, పాలకొల్లు, అంతర్వేది, కోటిపల్లి, పెనుగొండ, ద్రాక్షారం, అన్నవరం, అరసవల్లి, శ్రీకూర్మం, సింహాచలం, అరకులోయ ప్రాంతాలకు వెళ్లి వివిధ ఆలయాలను దర్శించుకున్నారు. తిరిగి అరకులోయ నుంచి గురువారం సాయంత్రం ఐదు గంటలకు భద్రాచలం దర్శనానికి వస్తుండగా మారేడుమిల్లి ఘాట్‌లోని వనదుర్గ ఆలయ సమీపంలోకి రాగానే బస్సు అదుపుతప్పి 30 అడుగుల లోయలోకి పడిపోయింది. అందరూ నిద్ర మత్తులో ఉండగానే ఈ ఘటన చోటుచేసుకుంది. చుట్టూ చీకటి. ఏం జరిగిందో తెలుసుకునేలోపు తొమ్మిది మంది విగతజీవులుగా మారారు. ఈ ప్రమాదంలో శైలజా రాణి, శ్యామల, పి.సునంద, శివ శంకర్ రెడ్డి, ఎస్‌వి.నాగేశ్వరరావు, కె.కృష్ణ, శ్రీకళ, దొరబాబు, కృష్ణకుమారి మృతి చెందారు.

వీరంతా చిత్తూరు జిల్లాలోని పలు మండలాలకు చెందిన వారు. బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మతి చెందిన కుటుంబాలతో పాటు క్షతగాత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయి. ఘటనా స్థలాన్ని రాష్ట్ర మంత్రులు అనిత, గుమ్మడి సంధ్యారాణి, మడింపల్లి రాంప్రసాద్, రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీషాదేవి, రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ చోళ బొజ్జి రెడ్డి సందర్శించారు. అనంతరం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బస్సు ప్రమాద బాధితులను కలెక్టర్ దినేష్ కుమార్‌తో కలిసి పరామర్శించారు.

క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సంధ్యారాణి

ఒక్కసారిగా బస్సు కుదుపునకు గురై పడిపోయింది

తీర్థయాత్రికులతో పాటుగా అన్ని ప్రాంతాలు చూడాలనే ఉత్సాహంతో నేను ముస్లిం అయినప్పటికీ నాతోటి వారితో యాత్రకు బయలుదేరాను. దురదృష్టవశాత్తు ఇలా జరిగింది నా చేయి విరిగిపోయింది. వెనుక వీపు భాగంలో ఎముకలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. సర్వ మతాలు ఒకటే అంటూ సన్నిహితంగా ఉండే నా పొరుగువారు ఇలా దుర్మరణం పాలుకావడం నన్ను చాలా బాధించింది. ఈ బస్సు ఘటన వల్ల కుటుంబ పెద్దలను కోల్పోయాను. అసలు బస్సులో ఆ క్షణాన ఏం జరిగిందో కూడా అర్థం కాలేదు.

-షేక్ ముంతాజ్, చిత్తూరు

నా కళ్ల ఎదుటే భర్త చనిపోయాడు

నా కళ్ల ఎదుటే నా భర్తకు తీవ్ర గాయాల పాలై చనిపోయాడు. ఈ వయసులో నాకు దిక్కెవరు ? నేను ఎవరిని ఆశ్రయించాలి, నాకు నేను, నాకు ఆయన ఈ వృద్ధాప్యంలో తోడునీడగా ఉండే వాళ్లం. తీర్థయాత్రలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని పుణ్యం సంపాదించుకుందామనుకునే సమయంలో ఇలాంటి దుర్ఘటన జరిగి నా జీవితంలో చీకటి మిగిల్చింది. మా బంధాన్ని విడదీసిన బస్సు ప్రమాదం మరి ఏ బంధాన్నీ విడదీయరాదు. మా ప్రాణాలను, మా జీవితాలను బస్సు ప్రమాదం ఇలా చీకటిమయం చేస్తుందని ఊహించలేదు.

- ఎస్.నాగేశ్వరి, చిత్తూరు జిల్లా

ఏమైందో తెలుసుకునేలోగా తొమ్మిది మంది బలి

చింతూరు మండల కేంద్రానికి మరికొద్ది సేపట్లో చేరుకుంటామనగా ఈ ప్రమాదం జరిగింది. బస్సు లోయలో పడటంతో తొమ్మిది మంది దుర్మరణం పాలవడం నన్ను కలిచివేసింది. ఏం జరిగిందో తెలుసుకునేలోపే పలువురు కన్నుమూశారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు ఉన్నాం. నాతోటి డ్రైవర్ బస్సు డ్రైవింగ్ చేస్తుండగా నేను విశ్రాంతి తీసుకుంటున్నాను. ఈ క్రమంలోనే హఠాత్తుగా బస్సు ఒక్కసారిగా కుదుపుకు గురై తలకిందులై లోయలో పడిపోయింది. ఈ ఘటనలో నా చేయి విరిగింది. వెన్నెముక దెబ్బతింది.

- పి.ప్రసాద్, డ్రైవర్

నాపై ముగ్గురి మృతదేహాలు

ఒకసారిగా బస్సు పల్టీకొట్టడంతో వెనుక సీటులో ఉన్న నాపై ముగ్గురు వ్యక్తులు వచ్చి పడ్డారు. వారంతా మృతి చెంది కనిపించారు. బస్సు తలకిందులుగా ఉండటంతో బయటికి రావటానికి తీవ్రంగా కష్టపడ్డాం. ఎలాగోలా కిటికీలో నుండి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నాను. నాతోటి ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడటంతో ఊపిరి ఆడక చనిపోయారు. నేను రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నాను. విశ్రాంత సమయం కావడంతో తీర్థయాత్రలకు వెళదామని మా గ్రామస్తులదరం కలిసి తీర్థయాత్రలకు బయలుదేరగా ఈ విధమైన దుర్ఘటన జరిగింది.

-వజ్రమణి, దొడ్డేపల్లి, చిత్తూరు జిల్లా

వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పిజిఆర్ఎస్‌కు 127 అర్జీలు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 127 వినతులు వచ్చాయి. జిల్లా ఇంచార్జ్ రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, ఆర్ డిఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. అర్జీదారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

స్వీకరించిన ఫిర్యాదులు కొన్ని..

హుకుంపేట మండలం మఠం పంచాయతీ బొందలమామిడి గ్రామానికి చెందిన తమర్భ శైలజ, టి.చిలకమ్మ గ్రామంలో కొత్త బోరు వేయాలని, కొత్త వాటర్ ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయనీ కోరారు. డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ సాగర గ్రామానికి చెందిన కె.తొడమ్మ, సిహెచ్.నాగేశ్వరరావు పంచాయతీకి చెందిన 7గ్రామాల్లో చెక్ డ్యామ్ ల నిర్మించాలని వినతి పత్రం సమర్పించారు. పాడేరు మండలం పాడేరు పంచాయతీ పి.గొందూరు గ్రామానికి చెందిన వి.మూర్తి గ్రామంలో విద్యుత్ లోవోల్టేజి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. పెదబయలు మండలం గంపరాయి పంచాయతీలో మత్స్య గెడ్డ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని సుసాగ్ చిరు ధాన్యాల చెల్లెళ్ళ సంఘం సభ్యులు కోరారు. జి.మాడుగుల మండలం గెమ్మలి పంచాయతీ భూంబొడ్డు గ్రామానికి చెందిన కె.చిన్నారి, పి.కొండమ్మ కుట్టు మిషన్ లో తర్ఫీదు పొందామని భృతి పొందడానికి చేయూతనివ్వాలనీ అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూ డిడి పిబికె పరిమళ, డిఇఒ కె.రామకృష్ణారావు, డిఆర్డిఎ పిడి వి.మురళి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్ నంద్, జిల్లా ఖజానా లెక్కల శాఖ అధికారి ఆర్.ప్రసాద్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి జగన్మోహనరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్ వి.రమణరావు, జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి దేవేంద్రుడు, జిల్లా పంచాయతీ అధికారి కెపి చంద్ర శేఖర్, జిల్లా అధికారులు, పలు మండలాల తహసీల్దార్ లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులకు ఉద్యోగోన్నతిపై హర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న భాష పండిత ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం పై స్థానిక మండలంలోని భాష పండితులు రాజబాబు, ప్రసాద్, ప్రభాకర్, విజయేంద్ర కిరణ్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా పెండింగ్లో ఉన్న భాష పండిత ఉపాధ్యాయులకు ప్రస్తుత ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో చర్చించి పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆనందదాయకమన్నారు. దీంతో తెలుగు, హిందీ, వ్యాయామ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాష పండిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీలేరు జలవిద్యుత్‌కేంద్రంలో నిలిచిన ఉత్పత్తి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి స్థానిక జల విద్యుత్ కేంద్రం మూడో యూనిట్‌లో సాంకేతిక లోపాలు తలెత్తడంతో విద్యుత్ ఉత్పత్తి నిలిచి పోయింది. ఒక్కొక్క యూనిట్ 60 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్లు ఉన్నాయి. మూడో యూనిట్‌కు వారం రోజుల క్రితమే గవర్నర్‌లో లోపాలు తలెత్తాయి. దీంతో యూనిట్ నుంచి విద్యుత్ ఉత్పత్తి నిలిపి వేశారు.యూనిట్‌లో లోపాలు సరిచేయడానికి ఇఇ రాజేంద్రప్రసాద్, ఇంజనీర్లు కార్మికులు తీవ్రంగా శ్రమించారు. అయినప్పటికీ ఫలితం దక్కలేదు. మరమ్మతు లోపాలను జెన్కో ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లారు. యూనిట్ మరమ్మత్తులు నిర్వహించడానికి ఆర్థో ఇంజనీరింగ్ కంపెనీకి అధికారులు సంప్రదించారు. యూనిట్ మరామత్తు పనులు నిర్వహించడానికి ఇంజనీరింగ్ నిపుణుల బందం సీలేరు జలవిద్యుత్తు కేంద్రాన్ని చేరుకొని సాంకేతిక లోపాలను సవరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎపి జెన్కో అధికారులు వెల్లడించారు.

చలిమంట వేసుకుంటున్న స్థానికులు

మన్యం గజ..గజ..

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో చలి గజగజ వణికిస్తోంది. చలి తీవ్రతకు తాళలేక ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. దీంతో పగలూ, రాత్రీ తేడా లేకుండా చల్లటి గాలులు వీస్తున్నాయి. మరోపక్క సీలేరు పురవీధుల్లో చలిమంటలు వేసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు 12 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యాహ్నం 26 డిగ్రీలకు చేరుకుంది. సాయంత్రం మూడు గంటల నుంచి ఉష్ణోగ్రత తగ్గుతూ చలి తీవ్రత అధికమవుతోంది. అర్ధరాత్రి సమయానికి 9 డిగ్రీలకు చేరుకోవడంతో అతి శీతలంగా మారిపోయి ఉన్ని దుస్తులు వేసుకున్నా చలికి తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. సీలేరు నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న గిరిజనులు చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. రానున్న రోజుల్లో మరింత చలి పెరిగే అవకాశం ఉందనే వార్తలతో ఆందోళన చెందుతున్నారు.

అంధకారంలో కితలోవ

ప్రజాశక్తి -కొయ్యూరు: కొయ్యూరు మండలం కొమ్మిక పంచాయతీ కితలోవ గ్రామానికి వారం రోజుల నుంచి విద్యుత్ సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో సరఫరా నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో శుక్రవారం రాత్రి ఎస్ఐ యాసీన్ వాహన తనిఖీలు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు సీలేరు పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నట్లు సమాచారం రావడంతో అప్రమత్తమై సిఆర్‌పిఎఫ్ బలగాలతో తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిపోయే అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని

అంగన్వాడీల ఆందోళన

పాడేరు, రంపచోడవరంలో భారీ ర్యాలీ, ధర్నా

పాడేరులో ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీలు, నాయకులు

ప్రజాశక్తి-పాడేరు:అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ప్రధాన డిమాండ్‌గా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అల్లూరి జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం అంగన్వాడి కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. అంతకుముందు పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన అంగన్వాడి వర్కర్లు, హెల్పర్లతో కిలో మీటరు పొడుగున ఈ ర్యాలీ సాగింది. ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అంగన్వాడీలకు జీతాల పెంపు హామీ నెరవేర్చకపోవడం దుర్మార్గమని తెలిపారు. గతంలో 42 రోజులు సమ్మె సందర్భంగా మినిట్స్ కాపీలో ఏవైతే డిమాండ్లు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం జరిగిందో అవన్నీ అధికారులకు వచ్చిన వెంటనే పరిష్కారం చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని తెలిపారు అందుకు ఎన్నికల్లో అంగన్వాడీ సంపూర్ణ మద్దతు ఇచ్చారని అన్నారు. ఆ మాట ప్రకారం ఇప్పటికైనా అంగన్వాడీలకు వేతనాలు పెంపు హామీ నెరవేర్చాలని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు, యూనియన్ గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. మార్కెట్లో నిత్యావసర ధరలు పెరుగుతున్నా వేతనాలు పెరగకపోవడంతో అంగన్వాడీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 8 ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యూటీ రూల్స్ ప్రేమ్ చేయాలన్నారు. మరొకసారి అంగన్వాడీలు రోడ్డు ఎక్కకుండా వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిగ్నల్స్ లేక యాప్ అప్లోడ్ చేయడంలో టెక్నికల్ ప్రాబ్లమ్స్ ఏర్పడుతున్నాయని అందుకు అంగన్వాడీల బాధ్యులు చేస్తూ అధికారులు బెదిరిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని తెలిపారు. అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పిల్లలకు తల్లికి వందనం వర్తించే విధంగా నిర్ణయం చేయాలన్నారు. డిఆర్‌ఓకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందర్రావు, జిల్లా ఉపాధ్యక్షులు కే.శంకర్రావు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి చిన్నారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి,11 ప్రాజెక్టులు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు.

ఐటిడిఎ ముట్టడి

రాజవొమ్మంగి:తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్వాడీలు రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన, కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టారు. తొలుత స్థానిక అంబేద్కర్ జంక్షన్ నుండి ఐటిడిఎ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా అధ్యక్ష, సహాయ కార్యదర్శులు ఎం వాణిశ్రీ, కె శాంతిరాజు, అంగన్వాడి యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నిర్మల తదితరులు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, మిగిలిన 1810 మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సంక్షేమ పథకాలు అమలు,సెంటర్ నిర్వహణకు నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు, అనేక సేవలు అందిస్తున్నారని వారికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి వేతనాలు పెరగలేదన్నారు. అంగన్‌వాడీలకు వేతనాల పెంపు తదితర సమస్య పరిష్కరించాలని 2023లో 42 రోజుల పాటు సమ్మె నిర్వహిస్తే ముగింపు సందర్భంగా వేతనాలు పెంచుతామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తానని మినిట్స్ ఇచ్చారని, అయినా నేటి వరకు వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఐటీవల 4687 మినీసెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఇంకా 1810 మినీ సెంటర్లలో క్వాలిఫికేషన్ లేదని మెయిన్ సెంటర్లుగా మార్చలేదని. కొంత మంది మినీ వర్కర్లకు పదో తరగతి ఉత్తీర్ణులైనా మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయలేదని, గ్రాట్యూటీ జిఒ నెం 8 ను సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గైడ్ లైన్స్ రూపొందించలేదన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని,పెండింగ్ లో ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్సేషన్ ఇచ్చి మెయిన్సెంటర్లుగా మార్చాలని,హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలుచెయ్యాలని.అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలుచేయాలని. అన్నియాప్ లు కలిపి ఒకయాప్‌గా మార్చాలని.సెంటర్ నిర్వహణకు 5 జి ఫోన్లు ఇవ్వాలన్నారు. ఎస్ఆర్ఎస్ రద్దు చేయాలని. గ్రాట్యూటి అమలుకు గైడ్‌లైన్స్ రూపొందించాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలని లబ్ధిదారులకు ఆయిల్, కందిపప్పు క్వాలిటి పెంచాలన్నారు. ప్రీ స్కూల్ ఏలోపేతం చేయాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటిడిఏ అధికారులకు అందజేశారు.అధికారుల హామీ మేరకు ఆందోళన విరమించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రాణి, రామలక్ష్మి,వెంకటలక్ష్మి, లక్ష్మి,7 మండలాలకు చెందిన అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రంపచోడవరంలో ర్యాలీ చేపడుతున్న అంగన్‌వాడీలు, నాయకులు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని జ్ఞాన సాగర్ వృత్తి విద్యా కళాశాల ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం శుక్రవారం మఠం పంచాయతీ గ్రామంలో ముగింపు సమావేశంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేదార్ గౌరీ మాట్లాడుతూ, ఈనెల 8 నుండి 12వ తేదీ వరకూ విద్యార్థులుతో కలిసి పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. శిబిరంలో భాగంగా పరిసర ప్రాంతాల పరిశుభ్రత, అవగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు, చిత్రలేఖనం, జాతీయ బృందగాన పోటీలు నిర్వహించామని చెప్పారు. విజేతలకు సర్పంచ్ అధ్వర్యంలో బహుమతులు ప్రధానం చేసినట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మఠం సర్పంచ్ శాంతకుమారి మాట్లాడుతూ, విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం సమాజానికి చాలా ఉపయోగకరమని అన్నారు. వికసిత భారత్, శ్రేష్ఠ భారత్ నినాదంతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. గ్రామ పెద్దలు కూడా ఈ శిబిరాన్ని తమ గ్రామంలో నిర్వహించడం ఆనందదాయ కమని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలతి పట్నా నాయక్, పాడేరు సాయి ఇంగ్లీష్ మీడియం ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రవికిరణ్ పట్నాయక్, వనవాసి మహిళల ఇన్‌ఛార్జ్ అచ్చమ్మ, సుభద్రమ్మ, దూరు వీధి ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది, కళాశాల విద్యార్థులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న బ్రహ్మకుమారి

తాగునీటి పథకం ప్రారంభం

ప్రారంభిస్తున్న ఎంపిపి నీలవేణి

ప్రజాశక్తి -అనంతగిరి: ఎన్నో ఏళ్లగా తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్న ఊటమామిడి గ్రామంలో తాగునీటి పథకం ప్రారంభం కావడంతో గ్రామస్తుల్లో ఆనందం వెల్లి విరిసింది. కాశీపట్నం పంచాయతీ ఊటమామిడి గ్రామంలో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన తాగునీటి పథకాన్ని ఎంపీపీ శెట్టి. నీలవేణి, స్థానిక ఎంపీటీసీ మూతిబోయిన. సన్యాసిరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ మదీనాలతో కలిసి ప్రారంభించారు. తాగునీటి సమస్యతో అల్లాడుతున్నా ప్రజలకు ఈ పథకం ప్రారంభం కావడంతో ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి కి సన్మానం చేశారు. సీతంపేట గ్రామానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని, గ్రామంలో వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా చెరువు తవ్వకానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు ఆమెను కోరారు. ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్టు ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చెరువు తవ్వకాలకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాశీపట్నం గ్రామపంచాయతీకి ఇప్పటికే సుమారు 30 లక్షల రూపాయలు వరకు మండల పరిషత్ నిధులను పంచాయతీ అభివృద్ధికి కేటాయించామని ఆమె తెలిపారు. తాను అధికారంలో ఉన్న లేకున్నా ప్రజల సమస్యలపై ఎల్లప్పుడూ పోరాటం చేస్తానని వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు స్థానిక పెద్దలు రాంబాబు ఎర్రి బాబు పుష్పానందం తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు ఘన సన్మానం

సన్మానిస్తున్న సిఐ, ఎస్ఐ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: అరకు, డుంబ్రిగూడ, అనంతగిరి ప్రాంతాలకు చెందిన మొత్తం 24 మంది యువకులు నూతనంగా పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడంతో అరకు సర్కిల్ ఆఫీస్‌లో శుక్రవారం ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అరకు సీఐ ఎల్ హిమగిరి, ఎస్సై జి.గోపాల్‌రావు ముఖ్య అతిథులు హాజరై సన్మానించారు. అరకు వేలీ నుండి 12 మంది, డుంబ్రిగూడ నుండి 8 మంది, అనంతగిరి నుండి 4 మంది మొత్తం 24 మంది కానిస్టేబుళ్లుగా ఎంపిక కావడం పట్ల అధికారులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ హిమగిరి, ఎస్సై గోపాల్‌రావు మాట్లాడుతూ, గిరిజన ప్రాంతాల్లోని యువతి, యువకులు కొత్తగా ఎంపికైన అభ్యర్థులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.చెడు మార్గాలకు దూరంగా ఉండి, ప్రభుత్వం అందిస్తున్న అనేక ఉద్యోగ అవకాశాలను వినియోగించుకొని కుటుం బాలకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగా ఎంపికైన కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు, అరకువేలీ ప్రధానోపాధ్యాయులు తాంగుల మోహన్‌రావు, సిపిఎం నేత రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రబీకి సరిపడే యూరియా పంపిణీకి చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి నంద్

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ రబీ సీజన్ కు 2025-26 గాను, అన్ని పంటలకు అవసరమైన 4012 మెట్రిక్ టన్నుల యూరియా ఎరువు పంపిణీకి ప్రణాళిక రూపొందించి పంపిణీకి చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ బి నంద్ తెలిపారు శుక్రవారం తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ, ఈ ఏడాది అక్టోబర్ 1 నాటికి 1017 మెట్రిక్ టన్నుల యూరియా ప్రారంభ నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి జిల్లాలో మొత్తం 2905 మెట్రిక్ టన్నుల అవసరం కాగా, ఇప్పటికే 2082 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ డిసెంబర్ ఆఖరికి మరో 400 మెట్రిక్ టన్నుల సరఫరా జరగనున్నట్లు తెలిపారు.రాబోయే 21 రోజులకు 462 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 800 మెట్రిక్ టన్నులను యూరియాను కో ఆపరేటివ్ సొసైటీలలో, ఆర్.ఎస్.కె లలో, మార్క్ ఫెడ్ గోదాములలో, రిటైల్/హోల్ సేల్, కంపెనీ గోదాములలో ఎరువును రైతాంగానికి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి ఎరువుల కొరత లేదని, దేశీయంగా ఉన్న అన్ని ఎరువుల కర్మాగారాలు ఉత్పత్తి చేయుచున్నాయన్నారు. విదేశాల నుండి కూడా అవసరమైన యూరియా దిగుమతులు సంతృప్తి కరంగా ఉన్నాయన్నారు. రాబోయే పంట కాలం లో కూడా యూరియాకు ఎటువంటి కొరత రాదని తెలిపారు.ఎరువులను కొనుగోలు చేయునప్పుడు బస్తా పై ముద్రించిన ఎం.ఆర్. పి ధరలను చూసుకుని, దాని ప్రకారము పైకము చెల్లించి, తప్పని సరిగా డీలరు నుండి రసీదు పొందాలన్నారు.ఎవరైనా డీలర్లు నిబంధనలు ఉల్లంఘించి, ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, ఎరువులను మళ్లింపు చేసిన, ఎం ఆర్ పి ధరల కంటే ఎరువులను అధిక ధరలకు విక్రయించినా లైసెన్స్ లు రద్దు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నగదు ఇస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-చింతపల్లి : సికిల్ సెల్ ఎనీమియాతో మృతి చెందిన చౌడుపల్లి సచివాలయం-2 వెటర్నరీ అసిస్టెంట్ కంకిపాటి అరుణ కుటుంబాన్ని ఆదుకునేందుకు సచివాలయం యూనియన్ ముందుకు వచ్చింది. మతురాలి కుటుంబానికి యూనియన్ మండల అధ్యక్షుడు వంపూరు శోభన్‌బాబు ఆధ్వర్యంలో సుమారు రూ.34 వేల ఆర్థిక సహాయం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా శోభన్‌బాబు మాట్లాడుతూ అరుణ ఎంతో సేవాభావంతో వెటర్నరీ సేవలు అందించారని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలు అరుణ కుటుంబానికి అందే విధంగా యూనియన్ కృషి చేస్తుందని చెప్పారు కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి నవ మోహన్, పవన్, మోహన్, మనోహర్, లలిత తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలి

ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

క్షతగాత్రులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు కిరణ్ తదితరులు

ప్రజాశక్తి - చింతూరు: మారేడుమిల్లి రోడ్డులో బస్సు ప్రమాదం బాధాకరమని, ప్రభుత్వం తక్షణమే మృతి చెందిన కుటుంబాలను ఆదుకోవాలని, గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం రాజమండ్రి, కాకినాడ హాస్పిటల్స్‌కి తరలించాలని, ఘాట్ రోడ్డుపై అనేక ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు ఎటువంటి నివారణ చర్యలు తీసుకోవడం లేదని, తక్షణమే ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం తెల్లవారుజామున మారేడుమిల్లి చింతూరు మధ్య ఘాట్‌రోడ్డుపై జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని ఎఎస్ఆర్ రంపచోడవరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పల్లపు వెంకట్ పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఘాట్‌రోడ్డులో మలుపుల తీవ్రతను బస్సు డ్రైవర్ గుర్తించకపోవడం వలన ఈ ప్రమాదం జరిగిందని, ఈ రహదారిలో పలు ప్రమాదాలు జరిగినప్పటికీ ప్రభుత్వాలు ఆ సమయంలో హడావుడి చేసి తరువాత వదిలేస్తున్నాయని రహదారిని వెడల్పు చేయడంతో పాటు రాత్రి పూట కనపడేటట్లు రేడియం లైటింగ్స్ ఏర్పాటు చేయాలని, మలుపులని డ్రైవర్లు గుర్తించే విధంగా రహదారి మధ్యలో మరియు రహదారికి ఇరువైపులా వైట్‌బోర్డర్స్ ఏర్పాటు చేయాలన్నారు. మలుపులు ఉన్నచోట లోయల ప్రమాదాన్ని గుర్తించేందుకు ఐరన్ బార్‌కేడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులను అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్, నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు పాల్గొన్నారు.

బూర్జలో పశువైద్య శిబిరం

పాడి రైతులకు సూచనలు ఇస్తున్న పశువైద్యాధికారి, సిబ్బంది

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలోని మారు మూల బూర్జ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం పశువైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. బాకూరు పశువైద్య అధికారి వరప్రసాద్ ఆధ్వర్యాన జరిగిన ఈ శిబిరంలో బూర్జ, జాకరవలసకాలని, తుంబవలస, వచనరంగిని గ్రామాలకు చెందిన సుమారు 360 పశువులకు వైద్యం, వ్యాధి నిరోధక టీకాలు, ఇంజెక్షన్లు అందించారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ, పశువుల్లో లంపి చర్మవ్యాధి (ఎల్ఎస్‌డి) లక్షణాలు గుర్తించినట్లు తెలిపారు. వ్యాధిగ్రస్త పశువులను వెంటనే ఐసోలేట్ చేసి కనీసం 28 రోజులు ఇతర పశువుల నుండి దూరంగా ఉంచాలని సూచించారు. కీటకాల ద్వారా వ్యాప్తి చెందే వైరస్‌ను అరికట్టేందుకు షెడ్‌లలో సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, మాలాథియన్ వంటి కీటకనాశకాలను స్ప్రే చేయాలనారు. అవసరమైతే వైద్యుల సూచనతో పశువుల శరీరానికి కూడా అప్లై చేయవచ్చని చెప్పారు. పశువులకు పోషకాహారం, పచ్చిక/గ్రీన్ ఫొడర్, తగినంత నీరు, మల్టీవిటమిన్, మినరల్ మిక్స్ ఇవ్వడం ఆరోగ్యానికి మంచిదని సూచించారు. కొత్తగా వచ్చిన పశువులను 21 రోజులు క్వారంటైన్ చేయాలని కూడా చెప్పారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది దిలీప్, కుమార్, ప్రవీణ్, నవీన్, సందీప్, కొండబాబు, లోకేష్, మోహన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

15న ర్యాలీని విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-చింతపల్లి : రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పాడేరులో ఈ నెల 15న నిర్వహించనున్న భారీ ర్యాలీకి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వైసిపి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు చింతపల్లి ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, వైసిపి మండల అధ్యక్షులు పాంగి గణబాబు స్థానిక విలేకర్లతో శుక్రవారం మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి సూచనలతో ర్యాలీకి విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెప్పారు. నేడు కూటమి ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరత, సదుపాయలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్త చేశారు. అత్యవసర సేవలు అందించే 104, 108 అంబులెన్స్ వాహనాలు సైతం ఇంధన కొరతతో నిలిచిపోవడం ఆందోళనకరమని పేర్కొన్నారు. పేదలకు వైద్య విద్య, వైద్య సేవలు అందించే ఉద్దేశంతో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేస్తే, వాటిని నేడు కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణ చేయడం దారుణమన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్‌కమిటి మెంబర్‌కాంతారావు

గిరిజన సహకార సంస్థ గోదాము, రేషన్ డిపోల ఆకస్మిక తనిఖీ

అడ్డతీగల- ప్రజాశక్తి : మండలంలో గిరిజన సహకార సంస్థ గోదాము రేషన్ డిపోలను రాష్ట్ర ఫుడ్ కమిటీ మెంబర్ కాంతారావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎల్లవరం గిరిజన సహకార సంస్థ డిపో, అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాల, ఎపి రెసిడెన్షియల్ స్కూల్, ఎపిఆర్ జూనియర్ కాలేజ్, విద్యార్థులకు అందించే మెనూ స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత జడ్పీహెచ్ స్కూల్ ఎల్లవరంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎల్లవరం, పాపంపేట గిరిజన సహకార సంస్థ రేషన్ డిపోను సందర్శించి స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించి సంతప్తి చెందారు. అడ్డతీగల హైస్కూల్‌లో రిజిస్టర్లు పరిశీలించి మధ్యాహ్న భోజనం స్టాక్ రిజిస్టర్లు సరిగా లేని కారణంగా హెచ్ఎంకి మెమో ఇవ్వాలని ఎంఇఒను ఆదేశించారు. బాలుర ఆశ్రమ హైస్కూల్ వార్డెన్, హెచ్ఎంకి కొన్ని సూచనలు చేశారు. టాయిలెట్స్ సరిగా లేవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఇఒ-1 రమేష్. ఎంఇఒ2 శ్రీనివాస్ ఉన్నారు.

రహదారి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం ఆర్ వి నగర్ నుంచి పాలగెడ్డ వరకూ రహదారి మరమత్తు పనులు తక్షణమే చేపట్టాలని డిసిసి కార్యదర్శి కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల ను పట్టించు కోకుండా ఆర్అండ్‌బి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నార ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే రహదారి మరమత్తు పనులు చేపట్టేలా అధికారులు చేపట్టకపోతే ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: స్థానిక కన్నయ్యమ్మపేట సమీపంలో జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న హిందూ స్మశానవాటికలో శుక్రవారం రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి ఆధ్వర్యంలో ఎపిపిఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు పర్యవేక్షణలో అభివృద్ధి పనులను శుక్రవారం చేప ట్టారు. ఈప్రాంతంలో చెత్త, వ్యర్థ పదార్థాలను వేయవద్దని సర్పంచ్ రమణి తెలిపారు. షెడ్ ఏర్పాటుకు దాతలు సహకారం అందించాలన్నారు. బోరు ఏర్పాటు తో పాటు మొక్కలు కూడా పెంచనున్నామని తెలిపారు.

క్షయ రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలి

లెప్రసీ, ఎయిడ్స్, టిబి నియంత్రణాధికారి కిరణ్‌కుమార్

రాజేంద్రపాలెం పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ

వార్డులో రోగులను పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- కొయ్యూరు: క్షయ రోగులను సకాలంలో గుర్తించి వెంటనే వైద్యసేవలందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా లెప్రసి ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి కిరణ్‌కుమార్ పిహెచ్‌సి వైద్యాధికారులను ఆదేశించారు. కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పిహెచ్‌సిని లెప్రసి ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి కిరణ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డులను పరిశీలించారు. ల్యాబ్ పరిశీలించారు. ఇప్పటివరకూ నమోదైన క్షయ రోగుల వివరాలు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను, అందుబాటులో ఉన్న క్షయ మందులను అన్ని రికార్డులు పరిశీలించారు. టిబి, కుష్టు రోగులకు అందుతున్న వైద్యసేవలను ఎప్పటికప్పుడు పరిశీలించి సకాలంలో రోగులను గుర్తించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. లెప్రసీ సర్వే అనంతరం గుర్తించిన అనుమానిత లెప్రసీ రోగులకు పరీక్షలను సకాలంలో పూర్తి చేసి వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 14 రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి 3106 మంది అనుమానిత రోగులను గుర్తించి పరీక్షలు నిర్వహించగా వారిలో 5 మందికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించినట్లు వీరికి ఉచితంగా మందులను అందించను న్నట్లు తెలిపారు. కాన్పుకు సిద్ధంగా ఉన్న గర్భిణిలను వారం రోజులముందుగా బర్త్ వెయిటింగ్ హోంలకు తరలించి సుఖప్రసవాలు జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిని ఆదేశించారు. మందులు, వ్యాక్సిన్లను తనిఖీ చేశారు. అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాల్సిందిగా వైద్యాధికారి డాక్టర్ జగదదీష్‌ను ఆదేశించారు.

పరిష్కారం కాని తాగునీటి సమస్య

ఇక్కడ కుళాయిలు లేక..

సర్పంచ్, కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న జెఎసి నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయిలో పూర్తిస్థాయిలో తాగునీరు రాక వద్దలు, మహిళలు, లాగరాయి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. లాగరాయిలో జలజీవన్ మిషన్ పథకం మంజూరైనప్పటికీ ప్రతి ఇంటికి కుళాయిలు రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జెఎసి నాయకులు గుమ్మడి ప్రసాదు, పీసా కార్యదర్శి, ఉపాధ్యక్షులు పాము మాధవన్, గోకిరి గంగరాజు, ఆదివాసీ జెఎసి కమిటీ సభ్యులు గుమ్మడి లోవరాజు, పూసం శివ, లాగరాయిలో నీరు శాశ్వత పరిష్కారం చేయాల్సిందిగా డిమాండ్ చేసారు. ఈ మేరకు సర్పంచ్ మిరియల గణలక్ష్మి, పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రం అందించారు.

అక్కడ మోటారు పనిచేయక...

రొబ్బసింగిలో పాడైన మోటారు

కొయ్యూరు: కొయ్యూరు మండలం డొనూరు పంచాయతీ పరిధి రొబ్బసింగి గ్రామస్తులు మూడు నెలలుగా తీవ్రమైన మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే మోటర్ పదే పదే మరమ్మతులకు గురవుతుండడంతో సమస్య తీవ్రమైంది. ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి పండ్రా గంగరాజు మాట్లాడుతూ పాత మోటార్ రిపేర్ చేసి మళ్లీ అమర్చడం, మళ్లీ అది కాలిపోవడం జరుగుతోందని, కొత్త మోటర్ అమర్చాలని కోరినా సెక్రటరీ స్పందించలేదని తెలిపారు.అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా డిమాండ్ చేశారు.

ఆధార్ అప్‌డేట్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక ఎంఇఒ కార్యాలయంలో ఆధార్ అప్డేట్ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక ఎంఇఒ -1 కెవివి సత్యనారాయ ణదొర, ఎంఇఒ-2 సూరయ్యరెడ్డి శుక్రవారం తెలిపారు. 5 సంవత్సరాలు నిండిన పిల్లల నుండి 15 సంవత్సరాల వరకూ ఉన్న విద్యార్థుల ఆధార్ వివరాలు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో అప్డేట్ చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం, శనివారం, సోమవారం ఎంఈఓ కార్యాలయంలో, మంగళవారం స్థానిక ఏకలవ్య పాఠశాలలోనే అప్డేట్ చేయనున్నట్లు తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -కొయ్యూరు: కొయ్యూరు మండలం బట్టపనుకులలో నిర్మాణంలో ఉన్న పంచాయతీ కార్యాలయ భవన పనులను శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత, పురోగతి, అవసరమైన సదుపాయాల ఏర్పాట్లపై అధికారులు ప్రత్యక్షంగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.డి.వి.ప్రసాద్, సర్పంచ్ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి అప్పారావు, పీసా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని కిర్రాబులో పంచాయతీ భవన నిర్మాణ పనుల ను జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ శుక్రవారం పరిశీలించారు. పనులు ఏ విధంగా జరుగుతున్నదీ పర్యవే క్షించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ నిర్మాణ సమయంలో నిరంతరం ఇంజనీరింగ్ అసిస్టెంట్ పర్యవేక్షణ చేయాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. డిడిఒ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మురళి, సిబ్బంది ఉన్నారు.

అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయండి

- సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-కూనవరం: 21న చింతూరులో నిర్వహించే అమర వీరుల సంస్మరణ సభ జయప్ర దం చేయాలని ఎఎస్ఆర్ రంపచో డవరం సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. మండలంలోని కూటూరులో అమరజీవి మిడియం మల్లయ్య స్తూపం వద్ద శాఖ సభ్యులు సోడె శ్రీరాములు శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొప్పెనకిరణ్ మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం ఆనాడు పలువురు అమరవీరులు నాయకత్వం వహించి ముఖ్యపాత్ర పోషించారన్నారు. అమర వీరుల స్ఫూర్తితో ప్రజా సమ స్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాలన్నారు. జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మడకం నాగమణి, మండల కమిటీ సభ్యులు పాయం సత్యనారాయణ, తెల్లం తమ్మయ్య,మడెం బాబురావు,శాఖ కార్యదర్శి నూపరాజు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న శ్రీరాములు

'నాయకులపై దాడి చేస్తే సహించేది లేదు'

ప్రజాశక్తి - గంగవరం: వైసిపి నాయకులు కూటమి నాయకులపై దాడులు చేసినా ఇబ్బందికరమైన వ్యాఖ్యలు చేసినా సహించేది లేదని పార్టీ మండల అధ్యక్షులు పల్లాల వెంకటరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిపై వైసిపి నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పాము అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్లకు సకాలంలో వ్యాక్సిన్ వేయించండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: నాటుకోళ్లకు పెంపకందారులు సకాలంలో వ్యాక్సిన్ వేయించాలని పశు వైద్యాధికారి తరుణ్ అన్నారు. బలిజపాడులో గురువారం 200 కోళ్లకు వాక్సిన్ వేసినట్లు తరుణ్ తెలిపారు. ఈ వాక్సిన్ వేయడంతో మంచి ఫలితం ఉంటుందన్నారు. గ్రామ సచివాలయల్లోని వెటర్నరీ అసిస్టెంట్‌కి తెలిపితే వ్యాక్సిన్ వేస్తారని సూచించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్ ఎపి జెన్కో రిటైర్డ్ ఎస్ఇ సివిల్ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం పలువురు పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. శుక్రవారం స్థానిక సాయిబాబా ఆలయములో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పంపు స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఇ సివిల్ హనుమ హాజరయ్యారు. రిటైర్డ్ ఎస్ఇలు సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, హనుమ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, ఎంపిటిసి పిల్లా సాంబమూర్తి వెంకటరావు పాల్గొన్నారు.

దానధర్మ చారిటబల్ ట్రస్టు ఆధ్వర్యంలో..

రాజవొమ్మంగి: దానధర్మ చారిటబల్ ట్రస్టు ఆధ్వర్యంలో శు క్రవారం నెల్లిమెట్ట గ్రామంలో వద్దులకు దుప్పట్లు పంపిణీ చేశారు. 15 మందికి వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో తాము సూరిబాబు, బొరగా రామకృష్ణ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఇలు చంద్రశేఖర్‌రెడ్డి, హనుమ

రాజఒమ్మంగి: దుప్పట్లు అందిస్తున్న ట్రస్టు సభ్యులు